క్లుప్తంగా

మున్సిపల్ కార్మికులకు దుస్తుల పంపిణీ



కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్

డోన్: మున్సిపల్ పరిధిలోని రెగ్యులర్ పారిశుద్ధ్య కార్మికులకు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ ప్రసాద్‌గౌడ్ మంగళవారం దుస్తులను పంపిణీ చేశారు. చైర్మన్ రాజేష్ మాట్లాడుతూ.. పట్టణ జనాభా ఏటా పెరుగుతున్న క్రమంలో వారి అవసరాలకు అనుగుణంగా పారిశుద్ధ్య సిబ్బందిని నియమించుకునే అధికారాన్ని మున్సిపాలిటీకి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులకు దాతలు ముందుకొచ్చి దుస్తులు పంపిణీ చేయాలని కోరారు. శానిటరీ ఇన్‌చార్జ్ సతీష్, మేస్త్రీలు లక్ష్మిరెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా అందజేత



బీరువాను అందజేస్తున్న దాత

డోన్ టౌన్: పట్టణంలోని నెహ్రూనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు దాత మార్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి సహకారంతో స్వామి వివేకానంద సేవా సమితి సభ్యులు రూ.12,500 విలువ చేసే బీరువా, ఆట వస్తువులను అందజేశారు. మంగళవారం స్కూల్ హెచ్‌ఎం తొగట సురేష్‌బాబును కలిసి వీటిని అందజేశారు. సేవా సమితి వ్యవస్థాపకుడు జగన్‌మోహన్, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగభూషణంరెడ్డి, జొన్నలగడ్డ శ్రీనివాసులు, కార్యదర్శి రంగయ్య, ఉపాధ్యక్షుడు కుళ్లాయప్ప పాల్గొన్నారు.

అధిక ధరలకు మటన్ విక్రయిస్తే చర్యలు



వ్యాపారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ

బనగానపల్లె రూరల్: బనగానపల్లె పట్టణంలో మటన్‌ను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని పంచాయతీ ఈఓ, ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ సతీష్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో మటన్ విక్రయదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కిలో మటన్ రూ.800కు మాత్రమే విక్రయించాలని, ఎక్కువ ధరకు విక్రయించే వారిపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని సూచించారు.

కూలింగ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు



ఖలీల్ సౌదాగర్‌ను సన్మానిస్తున్న బెలుం గుహల సిబ్బంది

కొలిమిగుండ్ల: ప్రముఖ పర్యాటక కేంద్రం బెలుం గుహల వద్ద ఎస్‌ఎంఎస్ లిమిటెడ్ కంపెనీ రూ.లక్షతో కూలింగ్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. వాటర్ ప్లాంట్‌ను కంపెనీ సీఈఓ, రిటైర్డ్ ఏఎస్పీ ఖలీల్ సౌదాగర్ ప్రారంభించారు. కొద్ది రోజుల క్రితం కంపెనీ డైరెక్టర్ రామచంద్రరావు బెలుం గుహల సందర్శనకు వచ్చిన సమయంలో పర్యాటకులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని గుర్తించినట్లు సీఈఓ తెలిపారు. వారి సౌకర్యం కంపెనీ కూలింగ్ వాటర్ సౌకర్యం ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో డీజీఎం సురేష్‌బాబు, గుహల మేనేజర్ అమర్‌నాథరెడ్డి, సిబ్బంది వెంకటరెడ్డి, గిరి, నిజాముద్దీన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివునికి అన్నాభిషేకం



శివునికి అన్నాభిషేకం చేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని పూదోట మఠంలో (భేతేశ్వర) శివలింగానికి సామూహిక అన్నాభిషేకం నిర్వహించారు. ఉదయం ఆశ్రమ కమిటీ సభ్యులు గుండా గోపాలు, సముద్రాల రామకృష్ణ ఆధ్వర్యంలో అర్చకులు ప్రభాకర శాస్త్రీ, బాలజీశర్మ శాస్త్రోక్తంగా వినాయకుడికి అభిషేకం, భేతేశ్వర శివలింగానికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం సామూహిక అన్నాభిషేకం చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కమిటీ సభ్యులు బుగ్గన విశ్వనాథ్‌రెడ్డి, నాగమోహన్‌రెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

- యాగంటిలో వేడుకగా ధ్వజారోహణం
- మూడు రోజుల పాటు విశేష పూజలు
- మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన ఆలయాలు



ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ ఈఓ, అర్చకులు

బనగానపల్లె: ప్రముఖ శైవక్షేత్రం యాగంటిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు మంగళవారం అంకురార్పణ చేశారు. ధ్వజారోహణతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ఈఓ చంద్రుడు, అర్చకులు మహేశ్వరశర్మ, యాగంటిపల్లె ఉపసర్పంచ్ బండిమౌలీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, కుంకుమార్చన, సహస్ర నామావళి నిర్వహించారు. అనంతరం ఉమామహేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలతో ధ్వజారోహణ పూజలు నిర్వహించి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. భక్తులకు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దంపతుల సహకారంతో ఉచితంగా లడ్డూ ప్రసాదాన్ని పంపిణీ చేశారు. మూడు రోజుల పాటు ఉంటుందని ఆలయ ఈఓ చంద్రుడు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

నేటి నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవాలు

పట్టణ సమీపంలోని నంద్యాల రోడ్డులో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బుధవారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. 26న ఉదయం నాదస్వరం, ద్వార పూజలు, వీరప్పయ్యస్వామికి పంచామృతాభిషేకాలు, 27న గ్రామోత్సవం, 28న అభిషేకం, అష్టోత్తర శతనామ పూజలు జరుగుతాయని వెల్లడించారు.



మంత్రి బీసీ సహకారంతో భక్తులకు ఉచిత లడ్డూల పంపిణీ

వేడుకలకు సర్వం సిద్ధం



ముస్తాబైన కాకనవరం రామలింగేశ్వరస్వామి ఆలయం

ప్యాపిలి: స్థానిక నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో బుధవారం గణపతి పూజ, ధ్వజారోహణం, గ్రామస్తులతో సామూహిక అభిషేకం తదితర పూజలు జరగనున్నాయి. రాత్రి 11:30 గంటలకు లింగోద్భవ సమయంలో రుద్రాభిషేకం, మహామంగళ హారతి, రుద్రహోమం జరగనుంది. అలాగే మెట్టుపల్లి సమీపంలోని కాకనవరం రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం రాత్రి 9 గంటల నుంచి భజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబు



డోన్: పాతబుగ్గ దేవాలయం



ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్

డోన్ టౌన్: శివరాత్రి ఉత్సవాలకు శివాలయాలు ముస్తాబయ్యాయి. కొత్త బుగ్గ, పాత బుగ్గలలో బుగ్గ తిరునాల సందర్భంగా బుధవారం జాగరణ, గురువారం తెల్లవారుజామున శివపార్వతుల కల్యాణోత్సవం, శుక్రవారం సాయంత్రం రథోత్సవం, శనివారం తెప్పోత్సవం నిర్వహించనున్నారు. వివిధ రకాల దుకాణాలు, ఎగ్జిబిషన్‌లో జెయింట్ వీల్, బ్రేక్ డాన్స్, కొలంబో తదితర వాటిని ఏర్పాటు చేశారు. అలాగే పట్టణంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలకు సర్వం సిద్ధం చేశారు.

క్రీడా పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎర్రబోతుల ఉదయ్‌భాస్కర్‌రెడ్డి

కొలిమిగుండ్ల: పెట్నికోట సమీపంలోని గుండుమల్లేశ్వరస్వామి ఆలయ క్రీడా మైదానంలో మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. బాల్‌బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీలను జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎర్రబోతుల ఉదయ్‌భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బ్యాడ్మింటన్ పోటీలకు రాయలసీమ జిల్లాలతో పాటు విజయవాడ, విశాఖపట్నం నుంచి 30 జట్లు వచ్చాయి. కబడ్డీ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి 20కిపైగానే జట్లు పాల్గొంటున్నాయి. క్రీడా పోటీలు 25వ వసంతంలోకి అడుగుపెట్టడంతో వ్యాయామ ఉపాధ్యాయులు ఉదయ్‌భాస్కర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. అందరి సహకారంతో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఏటా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉదయ్ తెలిపారు. క్రీడాకారులు స్నేహపూర్వక వాతావరణంలో క్రీడల్లో ఆడాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, నీలం సంజీవకుమార్‌రెడ్డి, కొండారెడ్డి, నాగేశ్వరరెడ్డి, పీడీలు భాస్కర్‌రెడ్డి, వైవీఎస్ నారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, మోహన్‌రెడ్డి, భుజంగరావు, శేఖర్, శ్రీనివాసులు, హరికృష్ణ, షెక్షావలి, శ్రీహర్ష పాల్గొన్నారు.

వరుసగా గేదెల అపహరణ

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని పెట్నికోటలో కొద్ది రోజుల నుంచి పాడి గేదెలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరిస్తున్నారు. దీంతో పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల క్రితం చంద్రారెడ్డికి చెందిన ఆరు గేదెలను తీసుకెళ్లారు. 20 రోజుల వ్యవధిలో ముగ్గురు రైతులకు చెందిన 20కి పైగానే గేదెలను అపహరించారు. సాధారణంగా గేదెలను ఉదయం వేళల్లో మేత కోసం పొలాలు, తోటల్లో వదిలేస్తుంటారు. పట్టపగలే దొంగలు ఎలా తీసుకెళుతున్నారో రైతులకు అంతుచిక్కడం లేదు. గ్రామంలో వరుసగా గేదెలు అపహరణకు గురవుతుండడంతో కొంత మంది దగ్గరుండి మేపుకుంటున్నారు. ఒక్కో గేదె రూ.40 వేల నుంచి రూ.50 వేలు వెచ్చించి కొనుగోలు చేశారు. వేలాది రూపాయలు నష్టపోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

అన్ని వ్యాధులకు ఆయుర్వేదంతో నయం

డోన్: దీర్ఘకాలిక వ్యాధులను సైతం నయం చేసే శక్తి ఆయుర్వేద మందులకు ఉందని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు గ్రేస్ శభాష్టియన్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలోని శివాలయం వద్ద మంగళవారం రోగులకు ఉచితంగా ఆయుర్వేద మందులను పంపిణీ చేశారు. అన్ని ఔషధాల కన్నా ఆయుర్వేద మందులు మిన్న అని తెలిపారు. స్థానికులకు అవగాహన కల్పించారు. మూడు రోజుల పాటు శివాలయాల వద్ద మందులు పంపిణీ చేస్తామన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక



ప్యాపిలి: జాహ్నవిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు,



డోన్: విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్యాపిలి: మండల పరిధిలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ఎంఈఓ వెంకటేష్ నాయక్ మంగళవారం తెలిపారు. ప్యాపిలి బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన చాకలి లలిత, మంగమూరి తరుణిమ, రమావత్ శ్రావణి బాయి, అలాగే పోతుదొడ్డి ఉన్నత పాఠశాలకు చెందిన జె. జాహ్నవి, చిన్నపొదిళ్ల ఉన్నత పాఠశాలకు చెందిన పుల్లాసి చరణ్ ఎంపికయ్యారని వెల్లడించారు. వీరికి కేంద్ర ప్రభుత్వం 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఏడాదికి రూ. 12 వేల చొప్పున ఉపకార వేతనం అందిస్తుందని తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

విద్యార్థికి అభినందన

డోన్ టౌన్: పాతపేట జెడ్పీ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థి శ్యాంకుమార్ ఎన్‌ఎంఎంఎస్‌కు అర్హత సాధించినట్లు హెచ్‌ఎం వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం విద్యార్థిని హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాకులు అభినందించారు. ఉపాధ్యాయులు వెంకటలక్ష్మి, సుబ్బారెడ్డి, రాధ, శ్రీనివాసులుపాల్గొన్నారు.



ఇల్లూరుకొత్తపేట జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులతో ఉపాధ్యాయులు

బనగానపల్లె రూరల్: మండలంలోని ఇల్లూరుకొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాల 8వ తరగతికి చెందిన ఐదుగురు విద్యార్థులు జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులు జ్యోతి, సుజిత, జగన్, యాసిన్‌బాషా, దుగ్గి సంపత్ అర్హత సాధించారన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన మధురోహిత్ ఎంపికైనట్లు హెచ్‌ఎం రామకృష్ణ తెలిపారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



కోవెలకుంట్లలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

కోవెలకుంట్ల: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన న్యాయవాదుల సవరణ చట్టం 2025ను వ్యతిరేకిస్తూ స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కంచారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి ఓబులేసు, మండల ఉపాధ్యక్షుడు తిరుపాలు ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు గేటు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. న్యాయవాదుల సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు ప్రేమ్‌నాథ్‌బాబు, జీఎల్ నరసింహుడు, జీసీ తిరుపతయ్య, విష్ణుమనోహర్‌రెడ్డి, కాశీంసాహెబ్, చంద్రుడు, శేఖర్, అల్లి ఉసేన్, సుధాకర్, కంబగిరి, ఇంద్రకుమార్ ఉసేనయ్య పాల్గొన్నారు.

రేపు కాకనవరంలో బండలాగుడు పోటీలు

ప్యాపిలి: మండల పరిధిలోని కాకనవరంలో ఈ నెల 27న బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెట్టుపల్లి సమీపంలో వెలసిన కాకనవరం రామలింగేశ్వరస్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీల్లో విజేతగా నిలిచిన వృషభాలకు రూ.40 వేలు, ద్వితీయ, తృతీయ, నాలుగో స్థానంలో నిలిచిన వృషభాలకు వరుసగా రూ. 30 వేలు, రూ. 20 వేలు, రూ. 10 వేలు చొప్పున నగదు బహుమతులు అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు ప్రవేశ రుసుం రూ. 500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9866794098 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

నేటి నుంచి శివరాత్రి వేడుకలు

కోవెలకుంట్ల: పట్టణంలోని గాంధీసెంటర్‌లో వెలసిన పంచముఖ సిద్ధేశ్వర స్వామి ఆలయంలో బుధవారం నుంచి శివరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. మహన్యాసపూర్వక విశేష పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, అర్ధరాత్రి 2 గంటలకు శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరపనున్నట్లు పేర్కొన్నారు. 27వ తేదీ స్వామివార్ల గ్రామోత్సవం, అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు. అలాగే రంగరాజు పేటలో వెలసిన కాళికామాత నాగలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి పండుగ సందర్భంగా కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



ఉపాధ్యాయులతో పదోతరగతి విద్యార్థులు

ఘనంగా ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం

ప్యాపిలి: మండల పరిధిలోని హుసేనాపురం ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం అన్వర్ మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే సరైన ప్రణాళికతో చదువుకోవాలని తెలిపారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షల గురించి ఒత్తిడి, ఆందోళన పడకుండా ప్రశాంతంగా రాయాలని సూచించారు. స్పష్టమైన, గుండ్రటి చేతిరాత ద్వారా ఎక్కువ మార్కులు సాధించవచ్చని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు అంజనప్ప, చంద్రమౌళి, దివాకర్, సర్వజ్ఞమూర్తి, మద్దిలేటి పాల్గొన్నారు.

గోశాలకు ఫ్యాన్లు అందజేత



ఫ్యాన్లు అందజేస్తున్న సేవా సమితి సభ్యులు

డోన్ టౌన్: కర్నూలు జిల్లా చిన్నటేకూరులో నిర్వహిస్తున్న శాంతి గో సంరక్షణశాలకు దాతల ఆర్థిక సహకారంతో డోన్ స్ఫూర్తి సేవా సమితి సభ్యులు ఫ్యాన్లు అందజేశారు. శివరాత్రిని పురస్కరించుకుని మంగళవారం గోశాలను సందర్శించి రూ. 15వేల విలువ చేసే ఏడు ఫ్యాన్లను అందించారు. గోశాల పర్యవేక్షకుడు సుబ్బారావు, స్ఫూర్తి వ్యవస్థాపకుడు మధు, సభ్యులు భాస్కర్, సురేష్, భాస్కర్‌నాయుడు, రంగారెడ్డి పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఆరుగురికి గాయాలు

బేతంచెర్ల: ఆటో బోల్తాపడి ఆరుగురు గాయపడిన ఘటన బనగానపల్లె మండలం బీరవోలు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. బేతంచెర్ల మండలం బలపాలపల్లె గ్రామానికి చెందిన 13 మంది కూలీలు బనగానపల్లె మండలం బీరవోలులో మిరప తోటలో వ్యవసాయ పనుల కోసం ఆటోలో వెళ్తున్నారు. బీరవోలు వంతెన వద్ద ఆటో ప్లేట్లు విరిగి బోల్తా పడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ప్రమాదంలో మధు, నాగలక్ష్మి, పక్కీరమ్మ, సువర్ణ, విజయ, మరియమ్మలకు గాయాలయ్యాయి. వారికి బేతంచెర్ల ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో కర్నూలు వైద్యశాలకు తరలించారు.

వీఆర్‌ఏ కుటుంబానికి న్యాయం చేయాలి

డోన్ టౌన్: రీసర్వే విధులు నిర్వహిస్తూ విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన అవుకు మండలం ఉప్పలపాడు వీఆర్‌ఏ తలారి రాముడు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శివరామ్, ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం డోన్ డివిజన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఏఓ అంజన్‌బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. మృతునికి దివ్యాంగ పిల్లలు ఉన్నారని.. భార్య, పిల్లలు ఇతనిపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. వీఆర్‌ఏ సంఘం నాయకులు రామచంద్రుడు, శివశంకర వరప్రసాద్, రంగయ్య, రామనాయుడు పాల్గొన్నారు.

పకడ్బందీగా రీసర్వే పనులు

బేతంచెర్ల: రీసర్వే పనులు పకడ్బందీగా నిర్వహించాలని డోన్ ఆర్డీఓ నరసింహులు సర్వేయర్లను ఆదేశించారు. మంగళవారం మండలంలోని బుగ్గానిపల్లె గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను ఆయన పరిశీలించారు. గ్రామాన్ని 32 బ్లాక్‌లుగా విభజించి ఒక్కో బ్లాక్‌ను రోజులో 20 ఎకరాలు రీసర్వే చేస్తారన్నారు. ప్రస్తుతం రెండు టీంలు పని చేస్తున్నాయని.. రీసర్వే సమయంలో 19 రోజులు ముందుగానే రైతులకు నోటీసులు ఇచ్చి సమాచారం ఇస్తామన్నారు. రైతులు సహకరించాలని కోరారు. ఆయన వెంట తహసీల్దార్ రమేష్, డీటీ మహేశ్వరరెడ్డి, మండల సర్వేయర్ నాగరాజు నాయక్, వీఆర్వోలు ఉన్నారు.

హత్యాయత్నం కేసు నమోదు

బేతంచెర్ల: పొలం గట్టు విషయంలో తండ్రీకొడుకులపై దాడి చేసిన ఇద్దరిపై మంగళవారం హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ లింగమయ్య తెలిపారు. ముసలాయిచెరువు గ్రామానికి చెందిన కుంచ రామేశ్వరరెడ్డి అదే గ్రామానికి చెందిన రాములమ్మ, మహేశ్వరరెడ్డి కుటుంబాల మధ్య పొలం గట్టు విషయంపై మనస్పర్థలు ఉన్నాయి. మంగళవారం కుంచ రామేశ్వరరెడ్డి, అతని కుమారుడు మదన్‌సుదర్శన్ రెడ్డిపై కత్తి, కర్రలతో దాడి చేశారు. గాయపడిన తండ్రీకొడుకులను చికిత్స నిమిత్తం బేతంచెర్ల ప్రభుత్వాస్పత్రికి.. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు తల్లీకుమారుడిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ వెల్లడించారు.

మతసామరస్యానికి ప్రతీక.. సంగమేశ్వర ఆలయం

- శివరాత్రి, ఉరుసుకు ఏర్పాట్లు



ఆలయానికి ఒకవైపు సంగమేశ్వర ఆలయం, మరోవైపు నూర్‌షావలి దర్గా

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల సమీపంలోని కుందూనది ఒడ్డున వెలసిన సంగమేశ్వర ఆలయం, నూర్‌షావలి దర్గా మతసామరస్యానికి ప్రతీకగా నిలిచాయి. ఐదు శతాబ్దాల చరిత్ర కలిగిన ఆలయంలో ఏటా శివరాత్రి, నూర్‌షావలి ఉరుసు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. శ్రీకృష్ణదేవరాయల కాలంతో ఈ ఆలయ చరిత్ర ముడిపడి ఉంది.

ఆలయ చరిత్ర

నూర్‌షావలి అనే భక్తుడు శివనామస్మరణ చేస్తూ దేశ పర్యటనలో భాగంగా ఈ ప్రాంతానికి చేరుకుని శివుడికి నిత్య పూజలు చేశారు. కొంత కాలం తర్వాత శివాలయం ఉన్న ప్రాంతంలో జీవసమాధి అయ్యాడు. నూర్‌షావలి వంశానికి చెందిన ఒక మహిళకు ఈశ్వరుడు కలలో కనిపించి శివాలయంలోనే నూర్‌షావలి దర్గా కట్టించాలని చెప్పడంతో ఆలయంలో ఒకవైపు శివాలయం, మరో వైపు నూర్‌షావలి దర్గాను నిర్మించారని ఇక్కడి వారి నమ్మకం. అప్పటి నుంచి ఏటా ఏటా శివరాత్రి, మరుసటి రోజు నుంచి రెండు రోజుల పాటు నూర్‌షావలి ఉరుసు నిర్వహిస్తుండడం విశేషం. వేడుకల్లో భాగంగా మొదటి రోజు సంగమేశ్వర ఆలయంలో శివరాత్రి, గురువారం నూర్‌షావలి దర్గాలో గంధం, శుక్రవారం ఉరుసు కార్యక్రమాలు జరగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.